అశ్రు నివాళి



జననం:
15-06-1948

మరణం:
13-03-2025

కీ॥శే॥ డా॥ అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజీ) గారు

ప్రముఖ పారిశ్రామికవేత్త

చెన్నైలో పుట్టి, గుంటూరులో క్రమశిక్షణ కలిగిన పారిశ్రామికవేత్తగా ఎదిగి,
కార్మికులతో పాటు, తోటి పారిశ్రామికవేత్తలలోనూ పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుని,
సామాజిక, దైవ సేవ కార్యక్రమాలలో ప్రముఖ పాత్ర పోషించిన మీ జీవితం మా అందరికి ఆదర్శం..

సేవా రత్న, విద్యాదాత, అన్నదాత, స్ఫూర్తిప్రదాత

కీ॥శే॥ డా॥ అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజీ) గారు

అకాల మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కుటుంబసభ్యులు

భార్య:	కుమారుడు:	కుమార్తె:
పరిమళ మాణిక్యవేల్	పర్విన్‌రాజ్ మాణిక్యవేల్	దివ్యభారతి మాణిక్యవేల్

BHARATHI CONSUMER CARE PRODUCT Pvt. Ltd.
Guntur

అంతిమయాత్ర: ఈ రోజు (ది.14-03-2025) శుక్రవారం మధ్యాహ్నం 10/2, అరండల్‌పేట, గుంటూరులో అన్నాజీ గారి స్వగృహం నుండి అంతిమయాత్ర బయలుదేరును.

క్లుప్తంగా...

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వీఆర్వోల సంఘం ప్రతినిధులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు విన్నవించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను కలిసి వినతి పత్రం అందజేశారు. సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా వీఆర్వోలకు జరుగుతున్న నష్టాన్ని కలెక్టర్‌కు వివరించారు. పనిభారం తగ్గించాలని, ఇతర శాఖల పనులు కేటాయించడంతో రీ సర్వే పనులు నిలిచిపోతున్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వీఆర్వోల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాసరావు, నందిగామ డివిజన్ అధ్యక్షుడు కె. లీలా ప్రసాద్, విజయవాడ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ బాజీ, ప్రచార కార్యదర్శి హుస్సేన్ తదితరులు ఉన్నారు.

షాపుల నిర్వహణకు బహిరంగ వేలం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వివిధ షాపుల నిర్వహణకు టెండరుదారులను గురువారం ప్రకటించారు. దేవస్థానం ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారి శ్రీనివాసరావు సమక్షంలో ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2026 ఏడాది కాలానికి గాను సీల్డ్ టెండర్లు ఓపెన్ చేసినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. భక్తులకు చెవి కుట్టి, చెవి పోగులు విక్రయించుకొను లైసెన్స్ హక్కును మోపిదేవికి చెందిన లకోజి బ్రహ్మానందం రూ. 7,91,000కు దక్కించుకున్నారన్నారు. సీసీ కెమెరాలు రిపేరు, సర్వీసు చేసేందుకు మచిలీపట్నంకు చెందిన టి. కేదార్‌నాథ్ రూ. 1,62,000కు, పెరుగు అన్నం సప్లయి చేసేందుకు మోపిదేవికి చెందిన వీఎల్‌కే గుప్త లీటరు పాలకు రూ. 74, స్వామివారి నిత్యాన్నదానానికి అరటి ఆకులు సరఫరా చేసే లైసెన్సు హక్కును మోపిదేవికి చెందిన కె. రాఘవేంద్రరావు 100 ఆకులకు రూ. 109కు దక్కించుకున్నట్లు తెలిపారు. మిగిలిన పాటలకు ఔత్సాహికులు ముందుకు రానందున వాయిదా వేశామని వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యానారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ అంతర విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన కె.జస్వంత్‌కుమార్ రాజు, కె.వి.జె.జస్వంత్‌కుమార్, ఎం.ఉదయభాస్కర్, ఎం.ఓబులేసు, ఎన్.శంకర్‌నాయక్, పి.బాలాజిరెడ్డి, పి.రవికిరణ్, టి.రవికిషోర్, ఎం.కౌశిక్ శశాంక్ చౌదరి, పి.శ్రీవివేక్‌కుమార్ జట్టులో చోటు దక్కించుకున్నట్లు వివరించారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. ఈ జట్టుకు మేనేజర్‌గా సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీ(ఏలూరు) పీడీ ఎస్.నల్లయ్య వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జట్టు బృందాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ వి.రాధికరెడ్డి వర్సిటీ ప్రాంగణంలో బుధవారం అభినందించారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): ఎస్సీ వర్గీకరణను అడ్డుకొని తీరుతామని, మాలలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని అఖిలభారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవిప్రసాద్ అన్నారు. గురువారం విజయవాడ గురునానక్ కాలనీ జేఏసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 23న చేపట్టనున్న 'హలో మాల.. చలో తిరుపతి' కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాలలకు న్యాయం జరిగేంత వరకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటుకేంద్రాన్ని నిలదీస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిక్రూట్‌మెంట్‌లు ఆపి చోద్యం చూస్తోందని, బ్యాక్‌లాగ్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయకుండా ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

వెబ్‌సైట్‌లో డీఎస్సీ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు సాంఘిక సంక్షేమశాఖ డీడీ షేక్ షాహెద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు మార్చి 15వ తేదీలోగా ఎంప్యానల్డ్ కోచింగ్ సంస్థలను ప్రాధాన్యతలను నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు వారి ప్రాధాన్యత ప్రకారం ఉచిత డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు.

డ్రెడ్జింగ్ యంత్రాలతో నదీ గర్భానికి తూట్లు

ఇసుకాసురుల చేతుల్లో కృష్ణమ్మ బందీ!

- ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- అమలు కాని వాల్టా చట్టం
- ఇసుక రవాణాకు అనువుగా అక్కడే పడవల తయారీ
- రోజుకు 500 ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా
- రూ. లక్షలు దోచుకుంటున్న కూటమి నేతలు



నది మధ్యలో డ్రెడ్జింగ్ చేసి పడవల్లో ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణమ్మకు కన్నీటి శోకమే మిగులుతోంది. ఇసుకాసురులు నదీగర్భంలో తూట్లు పొడిచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. విజయవాడకు కూత వేటు దూరంలో ఈ దందా జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తూ.. అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు.

కృష్ణమ్మకు గర్భశోకం..

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణా నదిలో అనుమతులు లేకుండా కూటమి నాయకులు భారీ యంత్రాలతో ఇసుక తవ్వి తరలిస్తున్నారు. నదీ గర్భంలో ఇసుక తవ్వకాలు జరపకూడదనే ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల హెచ్చరికలను పెడచెవిన పెట్టి యథేచ్ఛగా ఇసుక తవ్వుతున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడిచి నదీగర్భంలో డ్రెడ్జింగ్ యంత్రాలు వినియోగిస్తున్నారు. దోపిడీని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మైనింగ్, రెవెన్యూ అధికారులపై దౌర్జన్యానికి దిగుతున్నారు. దీంతో అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

కృష్ణానదిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. వాల్టా చట్టం ప్రకారం కృష్ణా నదిలో పడవల ద్వారా ఇసుక తవ్వాలంటే పీడబ్ల్యూడీ, జలవనరుల శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అనుమతులు ఉన్నా కూడా నీటి మట్టానికి 3.5మీటర్ల లోతులోనే మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉంది. అయితే ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా భారీ డ్రెడ్జింగ్ యంత్రాలు కలిగిన పడవలతో నదిలో రిగ్‌బోరు ద్వారా యథేచ్ఛగా ఇసుక తోడేస్తున్నారు. దీంతో నది గర్భంలో పెద్దసైజు గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇటువంటి గుంతలతోనే 2017లో ఫెర్రీ వద్దకు వచ్చిన పర్యాటకుల పడవ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో 22 మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు.

కూటమి నాయకుల కనుసన్నల్లోనే..

ఇబ్రహీంపట్నం ఫెర్రీ, గుంటుపల్లి గ్రామాల్లో కృష్ణా నది నుంచి ఇసుక తవ్వకాలు కూటమి నాయకుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. నెలరోజుల క్రితం నదిలో ఇద్దరు కూటమి నాయకులు రెండు పడవలతో ఇసుక తవ్వకాలు మొదలు పెట్టగా వారికి పోటీగా ఇప్పుడు సుమారు 25పడవల యజమానులు ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. పెద్ద సైజు పడవలో సుమారు 30నుంచి 40ట్రాక్టర్ల ఇసుక తీసుకొస్తున్నారు. చిన్న పడవల్లో 10ట్రాక్టర్ల ఇసుక చేరవేస్తున్నారు. నది ఒడ్డుకు చేరిన పడవల్లోని ఇసుకను 18 మాన్యువల్ క్రేన్‌ల ద్వారా ట్రాక్టర్లకు లోడింగ్ చేస్తున్నారు. పడవలు పాడైపోయిన యజమానులు వారి వద్ద ఉన్న క్రేన్, ఆ స్థలం నెలకు రూ.3లక్షల చొప్పున అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇక్కడే పడవల తయారీ..



ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద తయారు చేస్తున్న భారీ సైజు పడవలు

నదిలో ఇసుక తవ్వకాలకు అవసరమైన భారీసైజు పడవలను ఫెర్రీలోనే తయారీ చేస్తున్నారు. రెవెన్యూ, జలవనరులు, అగ్నిమాపక శాఖ అధికారుల అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలం కబ్జా చేసి భారీస్థాయిలో పడవలు తయారు చేస్తున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. డ్రెడ్జింగ్ యంత్రాలు కలిగిన ఒక్కొక్క పడవ సుమారు రూ.30నుంచి 35లక్షల వరకు వరకు ధర పలుకుతున్నాయి. తయారైన పడవలు వెంటనే పక్కనే ఉన్న కృష్ణానదిలోకి దించి ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడం ఇక్కడ పరిపాటిగా మారింది.

రోజుకు రూ. 3.5లక్షల ఆదాయం..



ఇబ్రహీంపట్నం ఫెర్రీలో మైనింగ్ అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

కృష్ణానది నుంచి తవ్విన ఇసుకతో కూటమి నాయకులు రోజుకు సుమారు 500 ట్రాక్టర్లు రవాణా చేస్తున్నారు. ప్రతిరోజు 10 పెద్ద సైజు పడవలు, 15 చిన్న సైజుల పడవల ద్వారా రోజుకు సుమారు 500 ట్రాక్టర్ల రవాణా చేస్తున్నారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన ట్రాక్టర్లకు లోడింగ్ చార్జీలు ఒక్కొక్కటి రూ.700 చొప్పున వసూలు చేసి రోజుకు రూ.3.50 లక్షలు సంపాదిస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.1.05 కోట్లు, ఏడాదికి రూ.12.60 కోట్లు అక్రమ సంపాదన వెనకేసుకునేందుకు కూటమి నేతలు ఇసుక దందాకు పాల్పడుతున్నారు. వీరి ఇసుక అక్రమ రవాణాకు స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతో మూడుపువ్వులు ఆరు కాయలుగా అక్రమ ఇసుక వ్యాపారం వర్ధిల్లుతోంది. అయితే ఇటీవల కూటమి నేతల్లో వచ్చిన ఆధిపత్య పోరుతో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో అధికారులు దాడులు చేయగా కళ్లు చెదిరే నిజాలు వెలుగులోకి వచ్చాయి. రెండు రోజుల క్రితం ఇసుక రవాణాకు సిద్ధంగా ఉన్న 24 ట్రాక్టర్లు, లోడింగ్ చేస్తున్న 18 క్రేన్‌లు, ఇసుక ఒడ్డుకు తీసుకొచ్చిన 10 పడవలు సీజ్ చేశారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు.

రబీ ధాన్యం సేకరణకు సన్నద్ధం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో రబీ (2024–25) సీజన్ ధాన్యం కొనుగోలుకు సన్నద్ధంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ మంజీర్ జిలానీ.. రబీ ధాన్యం సేకరణ సన్నద్ధతపై వర్క్‌షాప్‌తో పాటు ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌స్పెక్షన్ మాడ్యూల్, బఫర్ గోదాముల వినియోగం, కాగిత రహిత డిజిటల్ లావాదేవీలు తదితరాలపై వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు పౌర సరఫరాలు, వ్యవసాయం, సహకార, రవాణా తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. రబీ సీజన్ ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చేపట్టాల్సిన చర్యలపై ఎండీ మంజీర్ జిలానీ పలు సూచనలు చేశారు.

లక్ష్యాల మేరకు కొనుగోలు..

అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి 149 రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ద్వారా 16,353 మంది రైతుల నుంచి దాదాపు రూ. 257 కోట్ల విలువైన 1,10,738 టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇదే విధంగా రబీకి కూడా సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో ఈ–పంట నమోదు ఆధారంగా చూస్తే రబీలో 20,422 హెక్టార్లలో వరి వేశారని, 1,60,413 టన్నుల మేర ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశముందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని లక్ష్యాల మేరకు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణకు జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఆర్‌డీవోలు, పౌర సరఫరాల డీఎం, డీఎస్‌వో, డీఏవో తదితర అధికారులు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, పౌరసరఫరాల డీఎం ఎం.శ్రీనివాసు, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల క్రీడా పోటీలకు ఏర్పాట్లు



స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల నిర్వహణకు నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో పటిష్ట ఏర్పాట్లు పూర్తిచేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బందరురోడ్డులోని స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చి 18 నుంచి 20 వరకు జరిగే శాసనసభ్యుల క్రీడల పోటీల కోసం ఎలాంటి లోపం లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. క్రీడా పోటీల నిర్వహణలో విజయవాడ నగరపాలక సంస్థ నుంచి కావాల్సిన ప్రతి ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి మొదలయ్యే ఈ క్రీడల పోటీలకు, రాత్రిపూట అవసరమయ్యే ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈపర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరిండింటెంగ్ ఇంజనీర్లు పి.సత్యానారాయణ, పి. సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పవిత్ర పుణ్యక్షేత్రాలైన సప్త జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు భక్తులు, యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) విజయవాడ నుంచి భారత్ గౌరవ్ పర్యాటక రైలును నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల లోని యాత్రికులు ఏప్రిల్ 8 నుంచి 19వ తేదీ వరకు దేశంలోని ఏడు జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు ఈ రైలును నడుపుతున్నట్లు వివరించారు. ఈరైలు విజయవాడ నుంచి ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. 11రాత్రులు, 12రోజులపాటు సాగే ఈ ప్రయాణంలో ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకాలోని నాగేశ్వర్, సోమనాథ్‌లోని సోమనాథ్ జ్యోతిర్లింగం, పూణేలోని భీమశంకర, నాసిక్‌లోని త్రయంబకేశ్వర్, ఔరంగాబాద్‌లోని గ్రిష్ణేశ్వర జ్యోతిర్లింగాల దర్శనం ఉంటుంది. ఈ యాత్రలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయంతోపాటుగా పర్యటక ప్రదేశాలను దర్శించుకునేందుకు రోడ్డుమార్గంలో రవాణా సదుపాయం, హోటల్స్‌లో బస ఏర్పాట్లు ఉంటాయన్నారు. ప్రతి కోచ్‌కు ఎస్కార్ట్, టూర్ గైడ్, టూర్ మేనేజర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ప్యాకేజీ వివరాలు...

మూడు కేటగిరీలుగా ఉన్న ప్యాకేజీలో ఎకానమి(స్లీపర్ క్లాస్)లో పెద్దలకు ఒక్కొక్కరికి రూ.20,890, పిల్లలకు రూ.19,555, స్టాండర్డ్ (3ఏసీ) పెద్దలకు రూ.33,735, పిల్లలకు రూ.32,160, కంఫర్ట్ (2ఏసీ) పెద్దలకు రూ.44,375, పిల్లలకు రూ.42,485గా ధర నిర్ణయించారు. ఆసక్తికలిగిన వారు విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయం లేదా సెల్‌నంబర్లు 9281495848, 92810 30714లో సంప్రదించాలన్నారు. ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ ద్వారా కూడా టిక్కెట్లు బుక్‌చేసుకోవచ్చని వివరించారు.

జీజీహెచ్‌కి మైక్రోస్కోప్‌లు వితరణ



జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు మైక్రోస్కోప్‌లు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రామవరప్పాడు సర్కిల్ యూనియన్ బ్యాంక్ బ్రాంచి వారు తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ ప్రభుత్వాస్పత్రికి రూ. లక్ష విలువైన రెండు అత్యాధునిక మైక్రోస్కోప్‌లను అందజేశారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ఉపయోగపడే బైనాక్యులర్ మైక్రోస్కోప్, ట్రినాక్యులర్ హెడెడ్ బైనాక్యులర్ మైక్రోస్కోప్ విత్ డిజిటల్ కెమెరా ఉన్న వాటిని ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సీహెచ్ నాగార్జున జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ వెంకటేశ్వరరావుకు గురువారం అందజేశారు. వాటిని మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావుకు సూపరింటెండెంట్ అందజేశారు. కాగా పరికరాలు బ్యాంకు వారితో అందించేందుకు కృషి చేసిన ల్యాబ్ నోడల్ అధికారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. శుభాలక్ష్మి, గ్రేడ్–1 ల్యాబ్ టెక్నీషియన్ పి. నాగరాజులను సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు అభినందించారు. యూనియన్ బ్యాంకు డెప్యూటీ రీజనల్ హెడ్ బి. హరీష్, రీజనల్ హెడ్ ఎం. శ్రీధర్ డాక్టర్ ప్రసాద్‌బాబు, డాక్టర్ సరితా తదితరులు పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సరీ ప్రారంభం..

వేసవి నేపథ్యంలో సీరాలజీ ల్యాబ్‌లో పనిచేసే సిబ్బందికి ఉపయోగపడేలా గ్రేడ్–1 ల్యాబ్ టెక్నీషియన్ పి. నాగరాజు వాటర్ డిస్పెన్సరీని అందజేశారు. దానిని గురువారం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

రేపటి నుంచి సురభి పద్య నాటకోత్సవాలు

విజయవాడకల్చరల్: దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం(తంజావూరు), ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో 15తేదీ నుంచి 20వ తేదీ వరకు సురభి పద్యనాటకోత్సవాలు నిర్వహిస్తునట్లు సాంస్కృతికశాఖ సీఈవో ఆర్ మల్లికార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సురభి నాటక సంస్థలకు 140 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందని, 40మంది కుటుంబసభ్యులే సంస్థ సభ్యులుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నాటకాలను ప్రదర్శిస్తారని వివరించారు. నేటితరానికి సురభి సంస్థల విశేషాలను తెలియజేసేందుకు ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.15వ తేదీ సాయంత్రం భక్త ప్రహల్లద, 16న లవకుశ, 17న యాదాద్రి మహోత్సవం, 18న శ్రీకృష్ణలీలలు,19న జైపాతాళ భైరవి, 20వ తేదీన మాయాబజార్ నాటికల ప్రదర్శన ఉంటుందని వివరించారు. రోజూ సాయంత్రం ఏడుగంటలకు ప్రారంభమయ్యే నాటకాల ప్రదర్శనలకు ప్రవేశం ఉచితమని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం నిర్వాహక సంఘ సభ్యులు మాధవి పురాణం పాల్గొంటారని వివరించారు.

కాసారా.. కటకటాలే!

సారాక్షసిపై 'సాక్షి' కథనాలకు ఎక్సైజ్ శాఖ స్పందన

- సారా తయారీదారులపై అధికారుల వరుస దాడులు
- బెల్లం ఊటను ధ్వంసం చేసి పలువురిపై కేసులు నమోదు
- హర్షం వ్యక్తం చేస్తున్న తిరువూరు నియోజకవర్గ ప్రజలు



గంపలగూడెం మండల పరిధి అమ్మిరెడ్డిగూడెంలో సారా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



గంపలగూడెం మండల పరిధి మేడూరులో బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్‌శాఖ పోలీసులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: తిరువూరు నియోజకవర్గంలో నాటుసారా రక్కసి ఎన్నో ఏళ్లుగా వేధిస్తోంది. కల్తీ నాటుసారా తాగి ఎందరో అమాయకపు ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఎందరో నిరుపేదలు ఆర్థికంగా చితికిపోయి కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. దశాబ్దాలుగా జరుగుతున్న ఈ అక్రమ, అరాచకపు దందాను నిర్మూలించడంతో పాటు, నాటుసారా మహమ్మారిని రూపుమాపేందుకు మేము సైతం అంటూ 'సాక్షి' నడుం బిగించింది. సారా క్రయ, విక్రయాలు.. దానిని తాగడం వల్ల గిరిజన తండాలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు జరుగుతున్న తీరని నష్టంపై ఈ నెల 10వ తేదీ నుంచి 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించింది. దీనిపై స్పందించిన ఎక్సైజ్ శాఖ అధికారులు తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం, విస్సన్నపేట, ఎ. కొండూరు మండలాల్లో మెరుపుదాడులను నిర్వహించారు. నాటుసారా నిర్మూలనకు 'సాక్షి' స్పందించిన తీరుపై నియోజకవర్గ ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

సాక్షి ఎఫెక్ట్

ముమ్మరంగా దాడులు..

తిరువూరు నియోజకవర్గంలో నాటుసారా స్థావరాలను కూకటి వేళ్లతో పెకిలించాలని ఉమ్మడి కృష్ణా జిల్లా ఎక్సైజ్ డీసీ టి. శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ప్రణాళిక రూపొందించి పకడ్బందీగా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా సారా తయారీ దారులు, విక్రయదారులపైన నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేసే విధంగా మానిటరింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎక్సైజ్ సీఐ జె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు మెరుపు దాడులు జరుపుతున్నారు. మామిడితోటల్లో, అటవీ ప్రాంతాల్లో, ఇళ్ల ప్రాంగణాల్లో నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్నారు. సారా తయారీ దారులను అరెస్టులు చేస్తున్నారు. పాత నేరస్తులను అదుపులోకి తీసుకొని బైండోవర్‌లు చేస్తున్నారు. సారా విక్రయదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. సారా తయారీ, విక్రయాల వల్ల జరిగే నష్టాలపై గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నారు. నాటుసారాపై నిరంతర నిఘా ఉండేలా టీంలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక ప్రణాళికతో నాటుసారా నిర్మూలనకు ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

నాలుగు రోజుల్లో కేసులు ఇవే..

- నాటుసారా తయారీ, విక్రయాల వల్ల కలిగే నష్టాలపై 'సాక్షి' ఈ నెల 10వ తేదీన 'సారా ఏరులు' కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన ఎక్సైజ్‌శాఖ అధికారులు అదే రోజు గంపలగూడెం మండల పరిధి అమ్మిరెడ్డిగూడెంలో సారా కాస్తున్న పి. నర్సింహారావు, కొత్తపల్లి గ్రామంలో పి. మోహన్‌రావుని అదుపులోకి తీసుకున్నారు. కనుమూరులో పాత నేరస్తుడు జెర్రిపోతుల కోటేశ్వరరావు, విస్సన్నపేట మండల పరిధిలోని నరసాపురానికి చెందిన పాత నేరస్తులు ఉమ్మడి రాంబాబు, బాణావతు బుజ్జి, కాటూరి చెన్నారావు, వేమిరెడ్డిపల్లి తండాలో అజ్మీరా బాబురావులను బైండోవర్ చేశారు.
- ఈ నెల 11న విస్సన్నపేట మండల పరిధిలో పాత నేరస్తులు 8మందిని బైండోవర్ చేశారు. ఈ నెల 12వ తేదీన విస్సన్నపేట మండల పరిధిలోని వేమిరెడ్డిపల్లి తండాలో సారా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న 17మందిని బైండోవర్ చేశారు.
- మరలా 13వ తేదీన 'సారా నిర్మూలనే పల్లెలకు రక్ష' అనే కథనాన్ని సాక్షి ప్రచురించడంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు నియోజకవర్గంలో పలు చోట్లు మరోసారి దాడులు జరిపి బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారు. గంపలగూడెం మండల పరిధిలోని మేడూరు గ్రామంలో నిల్వ ఉంచిన 400లీటర్లు బెల్లంఊటను ధ్వంసం చేసి సారా కాసే వ్యక్తితో పాటు బెల్లం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసులు నమోదు చేశారు.

ప్రత్యేక నిఘా ఉంచాలి



నాటుసారాపై 'సాక్షి' వరుసగా కథనాలు రాయడం వల్ల అధికారులు కూడా దాడులు చేస్తున్నారు. కొద్ది కాలం దాడులు చేసి వదిలేయకుండా సారా తయారు చేసి అమ్మే వాళ్లపై ప్రత్యేక నిఘా ఉండాలి. శిక్షలు కూడా కఠినంగా ఉన్నప్పుడే మరోసారి సారా వైపు చూడకుండా ఉంటారు.

– శివయ్య, ముష్టికుంట్ల, తిరువూరు మండలం

రాజకీయ ప్రమేయం వద్దు



కాపుసారా అమ్మకాలు, తయారీ చేసే వ్యక్తులకు రాజకీయ నాయకుల అండ ఉండకపోతే ఈ మహమ్మారిని నియంత్రించడం పెద్ద విశేషమేమీ కాదు. సారా కాస్తూ పట్టుబడితే వెంటనే స్థానిక నాయకులే బెయిలు ఇప్పించి బయటకు తీసుకువస్తుండటంతో నేరస్తులకు భయం ఉండట్లేదు. పట్టుబడిన వారికి కఠిన శిక్షలు వేసి నిరంతర నిఘా ఉంచాలి.

– బి.వెంకటేశ్వరరావు, ప్రజాసంఘాల కార్యకర్త, తిరువూరు

బోరుగడ్డ అనిల్‌కు 14 రోజులు రిమాండ్

రాజమండ్రి జైలుకు తరలింపు

చిలకలపూడి(మచిలీపట్నం): బోరుగడ్డ అనిల్‌కు 14 రోజులు రిమాండ్ విధిస్తూ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి గురువారం రాత్రి తీర్పు వెల్లడించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం మండల పరిధిలోని బెరాక వసతి గృహంలో మైనర్ బాలిక చనిపోయిన కేసులో బోరుగడ్డ అనిల్ సోషల్ మీడియా ద్వారా పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై నమోదైన కేసుకు సంబంధించి ఇటీవల నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. దీంతో ఆయనను పోలీసులు అనంతపురంలో అరెస్ట్ చేసి మచిలీపట్నం తీసుకువచ్చి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. పూర్వాపరాలను విచారించిన అనంతరం అనిల్‌కు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అనిల్‌ను రాజమండ్రి జైలుకు తరలించారు.

వర్డ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్‌టీ, విభా, లీప్ ఫార్వర్డ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో భవానీపురంలోని బెరంపార్క్‌లో గురువారం వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెల్‌బీ తరహాలో దేశంలోని ప్రాంతీయ భాషా పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన ఏకైక ఆంగ్ల పోటీ ఇది అని తెలిపారు.

సాక్షి
పల్నాడు

శుక్రవారం । 14 । మార్చి । 2025



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

వినుకొండ: వినుకొండ పట్టణం, మండలంలో నరసరావుపేట ఏఏడీ పి. మస్తానమ్మ, వినుకొండ ఏఓ జి.వరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.



ఘనంగా ఆదికేశవస్వామి కల్యాణం

చేబ్రోలు: చేబ్రోలులోని ఆదికేశవస్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రులో కొలువైన భూనీలా సమేత వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రథోత్సవం జరగనుంది.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
నరసరావుపేట	6.25	5.02
గుంటూరు	6.23	5.00
బాపట్ల	6.23	5.00

అది మా సొమ్మేం కాదుగా.. ఎటుపోతే మాకేంటి ? అనుకున్నట్టున్నారు జిల్లా పౌరసరఫరా శాఖ అధికారులు.. మమ్మల్ని ఎవరు అడుగుతారులే.. అని తలపోశారేమో.. లేదా లాలూచీ పడితే లాభమేగా అనుకున్నారేమో.. ఏదైనా మీడియాలోనో ? లేదా వేరేరూపంలో ప్రకటనో ఇస్తే ఎక్కువ మంది వేలానికి వస్తారని భావించినట్టున్నారు. ఇలా చేస్తే తాము కట్టబెట్టాలని భావించిన వారికి న్యాయం చేయలేమని గట్టిగా నిర్ణయించుకున్నట్లున్నారు. అందుకే పట్టుబట్టి, పీడీఎస్ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా వేలం వేసేశారు. ఏదైనా లాభానికి వేలాన్ని ముగించారా అంటే.. ప్రభుత్వ ఖజానాకు గండి పెట్టి.. గతం కంటే తక్కువ ధరకే బియ్యాన్ని ఎంచక్కా దోచిపెట్టారు. ఈ పీడీఎస్ బియ్యానికి సంబంధించి సర్కారు వారి పాట ఏంటో ఒక్కసారి చూద్దాం.



సర్కారు వారి పాట!

టీడీపీ నేతకు రేషన్ బియ్యం అప్పగించేందుకు అధికారుల తాపత్రయం

- జిల్లావ్యాప్తంగా పట్టుబడిన రేషన్ బియ్యానికి గుట్టుచప్పుడు కాకుండా వేలం
- గతంలో కిలో రూ.32.50లకు పాడుకున్న పాటదారులు
- ఇదే బియ్యాన్ని రూ.22.50లకు అధికారపార్టీ నేతకు కట్టబెట్టిన వైనం
- ఇదీ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల తీరు
- ప్రచారం లేదు.. ప్రకటనా కానరాదు
- ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.35 లక్షలు గండి
- ప్రజాప్రతినిధి ఆదేశాల మేరకే హడావుడిగా కార్యక్రమం



పల్నాడు జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం

నరసరావుపేట టౌన్: బంగారమైనా, వస్తువైనా, మరే విలువైనదైనా వేలం వేసినప్పుడు సరైన ధర రాకుంటే, లేదా వేలం పాడుకున్న వారినుంచి ఇబ్బందులు ఎదురైతే మళ్లీ వేలానికి వెళతారు. మొదటిసారి వచ్చిన దానికంటే తక్కువకు పాడితే.. మరోసారి వేలం వేస్తారు. ఇదీ బ్యాంకుల్లోగానీ, మరే ఇతర సంస్థల్లోగానీ సాధారణంగా జరిగే ప్రక్రియ. అయితే పల్నాడు జిల్లాల్లోని పౌరసరఫరాల శాఖ అధికారుల తీరు మాత్రం వేరేగా ఉంది. పీడీఎస్ బియ్యం వేలంలో ప్రభుత్వానికి ఆదాయం చూపించాల్సిన అధికారులు.. ప్రజాప్రతినిధులు చెప్పిన వ్యక్తులకు లబ్ధి చేకూరేలా చక్రం తిప్పారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా పట్టుబడ్డ రేషన్ బియ్యం వేలంలో ఐదుగురు మాత్రమే పాల్గొనటం గమనార్హం. సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు గ్రామానికి చెందిన అక్రమ



బియ్యం వేలంలో సిండి'కేట్' ..

రేషన్ బియ్యం వ్యాపారి తన బినామీలతో వేలంలో పాల్గొనగా.. ఆయనే తక్కువ ధరకు బియ్యాన్ని దక్కించుకున్నాడు. పాటలో ఎవరూ పాల్గొనకుండా వ్యాపారుల నుంచి అధికారుల దాకా అంతా మేనేజ్ చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల సొమ్ముకు పంగనామాలు పెట్టి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారు.

ఇదీ వేలం కథ...

పల్నాడు జిల్లాలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యానికి గతేడాది డిసెంబర్ 18న వేలం నిర్వహించారు. అప్పుడు కిలోకు రూ.32.50 లకు పాడుకున్నారు. అనంతరం సదరు పాట పాడుకున్న వ్యక్తి నగదును పాక్షికంగా చెల్లించడంతో ఆ పాటను రద్దు చేశారు. మరోసారి వేలం నిర్వహించాలని జిల్లా పౌరసరఫరా శాఖ అధికారులు భావించారు. అయితే గతంలో వేలం సమయంలో ఎలాంటి నిబంధనలు పాటించారో వాటినే మళ్లీ పాటించాలి. ముందుగా పత్రిక ప్రకటన ఇవ్వాలి. జిల్లావ్యాప్తంగా ప్రచారం కల్పించాలి. అప్పుడే ఎక్కువమంది వేలానికి హాజరవుతారు. తద్వారా వేలం ధర ఎక్కువ పలుకుతుంది. ప్రభుత్వ ఖజానాకు మేలు జరుగుతుంది. కానీ ఇవేమీ చేయకుండానే జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ఈ ఏడాది మార్చి 7వ తేదీన వేలం వేసేందుకు నిర్ణయించారు. గతంలో కేజీ రూ.32.50లు పలికిన ధరను ఇప్పుడు సగటున కేవలం రూ.22.50లకు అంటగట్టారు. బియ్యం ధర కేవలం మూడు నెలల్లోనే అమాంతంగా తగ్గిపోయింది. దీని వెనుక ప్రజాప్రతినిధులు, జిల్లా పౌరసరఫరాల అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.35 లక్షలు నష్టం వాటిల్లింది.

నిబంధనల ప్రకారమే..

పట్టుబడ్డ రేషన్ బియ్యం మూడు నెలల క్రితం వేలం వేయగా కేజీ రూ.32.50ల వరకు పాడారు. అతను రూ.లక్ష చెల్లించి మిగిలిన డబ్బులు కట్టేందుకు ముందుకు రాకపోవటంతో తిరిగి వేలం నిర్వహించాం. మూడు రకాల క్వాలిటీ ఉండటంతో ఒక రకం రూ.24, రెండవ రకం రూ.22, మూడవ రకం రూ.20 లకు వేలంలో పాడారు. వేలం విషయంపై డీఎస్ఓ కార్యాలయం వద్ద నోటీస్ అంటించి ప్రచారం నిర్వహించాం. ఎటువంటి ప్రకటనలు ఇవ్వలేదు.

– నారదముని, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

జాతీయ రహదారి విస్తరణ పనులపై జేసీ సమీక్ష



శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వం సారథ్యంలో 544డీ జాతీయ రహదారి నాలుగు లైన్ల విస్తరణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 544డీ జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించే పనులకు సంబంధించిన భూసేకరణపై రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ వినుకొండ నుంచి గుంటూరు వరకు 85 కి.మీ వరకు నిర్మించనున్న రోడ్డుకు రూ.2605 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. పల్నాడు జిల్లాలో నాలుగు మండలాలకు గాను 19 గ్రామాల పరిధిలో 53.38కి.మీ మేర పనులు జరుగుతాయన్నారు. ఇందుకుగాను జాతీయ రహదారి అధికారులు మ్యాప్ సిద్ధం చేసి ప్రాథమికంగా సమాచారాన్ని సేకరించారన్నారు. మొదట దశలో 3ఏ గెజిట్ నోటిఫికేషన్, రెండవ దశలో భూసేకరణ చేసిన భూముల్లో రెవెన్యూ, నేషనల్ హైవే అధికారుల సంయుక్త మార్కింగ్ పనులు.. మూడో దశలో డిక్లరేషన్ ఆఫ్ ల్యాండ్ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయడం.. నాల్గో దశలో జేసీ సారథ్యంలో రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం.. ఐదవ దశలో జిల్లా కలెక్టరు అనుమతితో భూములను జాతీయ రహదారుల శాఖకు అప్పగించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మొదటి దశ ప్రారంభమైందన్నారు. సంవత్సరం వ్యవధిలో పనులు పూర్తి చేయటానికి అధికారులు కసరత్తు చేస్తున్నారన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ సబావత్ సురేష్‌నాయక్, జాతీయ రహదారి అధికారులు వెంకటేశ్వర్లు, అశోక్, మండల సర్వేయర్ రాజు, సర్వే అధికారి పేరిసోముల నాసరయ్య, ఆర్ఐ చంద్రబాబు, తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కామిరెడ్డి



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కాగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు.

1,41,244 మిర్చి బస్తాలు విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,28,725 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,41,244 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాలకు సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 56,214 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.


కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కిడ్నీ డే సందర్భంగా ఎయిమ్స్‌లో వాకథాన్



మంగళగిరి: కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ అహెంతమ్ శాంతా సింగ్ తెలిపారు. అంతర్జాతీయ కిడ్నీ డే సందర్భంగా గురువారం ఉదయం ఎయిమ్స్‌లో వైద్యులు, మెడికల్ విద్యార్థులతో వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శాంతా సింగ్ మాట్లాడుతూ కిడ్నీ అనారోగ్యం బారిన పడితే ఆ ప్రభావం శరీరంలోని ప్రతి అవయంపైనా పడుతుందన్నారు. కిడ్నీలను కాపాడుకోవడంలో అప్రమత్తంగా ఉంటే ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. నేటి ఆధునిక సమాజంలో కిడ్నీల విక్రయాలు జరగడం దారుణమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీమంత కుమార్ దాస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ నెఫ్రాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఉత్తర దాస్, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలిలో ముగిసిన ప్రత్యేక సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునఃపరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారంతో ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సదరం క్యాంప్‌ను అధికారులు నిర్వహించారు. ఈఎన్‌టీ, అప్తమాలజీ, ఆర్థోపెడిక్, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులకు వైద్య పరీక్షలు చేశారు. క్యాంప్‌లో పలు ప్రభుత్వ వైద్యశాలలకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. క్యాంప్‌ను వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.

'సహకారం' అందించని వారిపై చర్యలు

సహకార అభివృద్ధి కమిటీ సమీక్షలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలోని సహకార సంఘాల కంప్యూటరీకరణ ఈనెల 20వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో చేయాలని, 21 నుంచి జిల్లాలో 59 పీఏసీలు ఈ–పీఏసీలుగా మార్చాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 5వ జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఏడాదిగా సంఘాల కంప్యూటీకరణ జరుగుతోందని, పురోగతి సరిగాలేదన్నారు. సరిగా పనిచేయని సంఘం సీఈఓపై ఏం చర్యలు తీసుకున్నారని జిల్లా సహకార అధికారిని, గుంటూరు కేంద్ర సహకార బ్యాంకు సీఈఓను ప్రశ్నించారు. కంప్యూటీకరణ పూర్తిచేసే విషయంలో పనిచేయని వారిపై మార్చి 21వ తేదీన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నాటు సారా తయారీపై నిఘా కోసం డ్రోన్లు వినియోగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నాటు సారా తయారీ, రవాణా, వినియోగాన్ని సంపూర్ణంగా నిర్మూలించేందుకు కృషిచేయాలన్నారు. కలెక్టరేట్‌లో నవోదయం 2.0 కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సారా తయారీ, వినియోగాలను నిరసిస్తూ నవోదయం పోస్టర్‌ను విడుదల చేశారు. అదేవిధంగా జిల్లాలో గుర్తించిన 442 చిత్తడి నేలలు ఉన్నాయని, వాటిలో ఏడు ఇన్‌సైడ్ రిజర్వ్ ఫారెస్ట్, 435 రెవెన్యూ ఇతర ప్రదేశాలలో ఉన్నాయని వాటిని సంబంధిత శాఖలు పరిశీలించి ఈనెల 28నాటికి నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఆర్‌ఓ మురళి, డీఎఫ్‌ఓ కృష్ణప్రియ, ఆర్డీవోలు కె.మధులత, రమాకాంత్ రెడ్డి, మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మొల్లమాంబ జీవితం ఆదర్శం..

నరసరావుపేట: కవయిత్రి మొల్లమాంబ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత, విద్యార్థులు స్ఫూర్తి పొందాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొల్ల జయంతిని అధికారంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. రామాయణాన్ని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా కేవలం ఐదు రోజులలో రచించిన గొప్ప కవి మొల్లమాంబ అని కొనియాడారు. ఆమె పేరుతో ప్రభుత్వం స్టాంప్ కూడా రిలీజ్ చేసిందన్నారు. ఈ సందర్భంగా పలువురు శాలివాహన సంఘం నాయకులు కోరిన విధంగా ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మట్టిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓను ఆదేశించారు. బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటేశ్వర్లు, సంఘ నాయకులు శ్రీనివాసులు, బసవేశ్వరరావు, వెంకయ్య, వెంకటేశ్వర్లు, మంగమ్మ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

శక్తి వాహనాలు ప్రారంభించిన జిల్లా ఎస్పీ



వాహనాలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట: మహిళలు ఫోన్లో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి నుంచి తక్షణ సహాయం పొందాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసులకు, మహిళలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కోసం శక్తి యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, లైంగికదాడులు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే యాప్ ఓపెన్ చేసి ఎస్ఓఎస్ బటన్‌ను నొక్కితే, లొకేషన్ ఆధారంగా పోలీసులు తక్షణమే స్పందించి అక్కడకు చేరతారన్నారు. అనంతరం జిల్లాకు మంజూరైన శక్తి వాహనాలను ప్రారంభించారు. పరిపాలన విభాగం అదనపు ఎస్పీ జేవీ సంతోష్, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, జగదీష్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుభాషిణి, మహిళా ఎస్ఐలు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్ విడుదల..

నరసరావుపేట: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని, దానిని నిర్మూలించడానికి కొన్ని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాటిని అరికట్టే దిశలో ఉన్నామని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్ విడుదల చేశారు.

పేరుంది.. ఊరేది?

- పేరుండి ఊరులేని గ్రామంగా పుట్టిపాడు ఖ్యాతి
- రెవెన్యూ రికార్డులలో మాత్రమే పేరు
- భౌతికంగా కనపడని గ్రామం
- భూముల క్రయవిక్రయాల్లో గ్రామం పేరు వాడకం
- గ్రామానికి గుర్తుగా మిగిలిన ఆంజనేయస్వామి గుడి



పుట్టిపాడు గ్రామానికి గుర్తుగా ఉన్న పురాతన ఆంజనేయస్వామి గుడి


అమరావతి: భౌతికంగా ఆ గ్రామం ఎవరికీ కనిపించదు. ఇంకా చెప్పాలంటే ఆ గ్రామం ఉన్నట్టు స్థానికులకే తెలియదు. అయితే రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఆ ఊరు పేరు భద్రంగా ఉన్న విచిత్ర పరిస్థితి కనబడుతుంది . భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు వంటి కార్యకలాపాలన్నీ పుట్టిపాడు గ్రామం పేరిటే కొనసాగుతున్నాయి. భౌతికంగా లేని గ్రామం పేరుతో కార్యకలాపాలన్నీ కొనసాగడం విశేషం.

రాజా వాసిరెడ్డి కాలంలో అగ్రహారంగా..

రెవెన్యూ రికార్డుల ప్రకారం మండల పరిధిలో పుట్టిపాడు గ్రామం ఉంది. అయితే ఆ గ్రామం అక్కడ కనబడదు. ఈ గ్రామం అని చెబుతున్న ఊరిలకి ఒక పక్క అమరావతి మండలంలోని మునగోడు, మరో పక్క అచ్చంపేట మండలంలోని కస్తల గ్రామాలు, ఇంకో పక్క కృష్ణానది మాత్రమే కనిపిస్తాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం మునగోడు గ్రామం మాత్రమే కనబడుతుంది. పుట్టిపాడు గ్రామంలో పొలాల క్రయవిక్రయాలు చేసుకుంటే మునగోడు గ్రామం పేరిట మాత్రమే సాధ్యమవుతుందని గ్రామస్తులు తెలిపారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పరిపాలన కాలంలో పుట్టిపాడు గ్రామం మల్లాది, కస్తల గ్రామాల వలే అగ్రహారంగా ఉండేది. రెండువందల ఏళ్ల క్రితం ఆ గ్రామంలో ప్రజలు ఉండేవారని.. కాలక్రమేణా అగ్రహారంలోని బ్రాహ్మణులు పొలాలు అమ్ముకుని జీవనం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఊరు ఖాళీ అయ్యిందని పెద్దలు చెబుతున్నారు. అయితే అప్పట్లో రికార్డుల్లో అధికారికంగా నమోదై ఉండడంతో ఆ పేరుతోనే నేటికీ కార్యకలాపాలు సాగుతున్నాయి.

కాలక్రమేణా కనుమరుగు

అప్పట్లో గ్రామ పరిధిలోని సుమారుగా 5 నుంచి 6 వందల ఎకరాల భూమి ఉండేది. అమరావతి మండలంలో 17 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.. వాటిలో నేడు 16 భౌతికంగా ఉన్నప్పటికీ పుట్టిపాడు గ్రామం మాత్రం కనుమరుగైంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం పుట్టిపాడు అనే గ్రామం ఉన్నా.. మునగోడు రెవెన్యూ గ్రామంలో కలపటంతో భూయజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పుట్టిపాడు రైతుల భూములు మునగోడు గ్రామ పరిధిలోకి తీసుకోవటంతో మునగోడు గ్రామ సచివాలయంలో పుట్టిపాడు గ్రామ రైతులకు పలు సేవలు అందుతున్నాయి.



కృష్ణానది వద్ద కోతకు గురవుతున్న భూములు

ఈ గ్రామం కృష్ణానది ఒడ్డునే ఉండటంతో ప్రతి ఏడాది వరదలు వచ్చినప్పుడల్లా కొంతమేర భూమి కృష్ణానదిలో కలిసిపోవటంతో ప్రస్తుతం పొలం విస్తీర్ణం కూడా తగ్గిపోయింది. అలాగే ఇప్పటికీ గ్రామానికి గుర్తుగా ఆంజనేయస్వామి గుడి మిగిలి ఉండటం విశేషం

వందేళ్ల క్రితం ఉండేదంట..



మునగోడు గ్రామ శివారులో ప్రస్తుతం పుట్టిపాడు పొలాలు మాత్రమే ఉన్నాయి. గతంలో వందేళ్ల కిందట గ్రామం ఉందని మా పెద్దలు చెప్పేవారు. కాలక్రమేణా పుట్టిపాడు గ్రామాన్ని మునగోడుకు శివారు గ్రామం మార్చారు. ఇంకా పుట్టిపాడు పేరుమీదే భూలావాదేవీలు జరుగుతున్నాయి. బ్యాంకులలో లోన్లు తీసుకునే సమయంలో గ్రామం పేర్లలో తేడాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదికారులు పూర్తిగా మునగోడు రెవెన్యూ పరిధిలో ఈగ్రామ భూములు కలపాలి.

– యన్నం పైదారెడ్డి, రైతు, మునగోడు

పుట్టిపాడు పేరుమీదనే రెవెన్యూ సేవలు

మండలంలో పుట్టిపాడు మునగోడు శివారు గ్రామంగా ఉంది. ఈగ్రామ భూసంబంధిత సేవలన్నీ మునగోడు గ్రామ సచివాలయంలో అందిస్తారు. రైతులు ఎప్పటి నుంచో మునగోడులో కలపాలని అడుగుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల పేరకు పుట్టిపాడు పేరుమీదే రెవెన్యూ రికార్డులు కొనసాగుతున్నాయి

– ఎం.డానియల్, అమరావతి తహసీల్దార్

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

17వ తేదీ నుంచి ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారులు పూర్తి చేశారు. ఈనెల 17వతేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించేందుకు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారులు టైంటేబుల్ ప్రకటించారు. ఆయా తేదీలలో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పల్నాడుజిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 128 పరీక్ష కేంద్రాలలో 463 ఉన్నత పాఠశాలల నుంచి 26,497 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు పరీక్షా కేంద్రాల సమీపంలోని 30 పోలీస్‌స్టేషన్‌లను గుర్తించారు. గురువారం సెట్–1 ప్రశ్నపత్రం జిల్లా కేంద్రంలోని కేబీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్టోరేజ్ పాయింట్‌కు చేరుకోగా శుక్రవారం వాటిని ఆయా పోలీస్‌స్టేషన్‌లకు తరలించనున్నారు. సెట్–2 ప్రశ్నపత్రం శుక్రవారం స్టోరేజ్ పాయింట్‌కు చేరుకోగా శనివారం తరలించనున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు, పరీక్షా సమయంలో ఏవైనా సమస్యలు, సందేహాలు తలెత్తినప్పుడు సత్వరం పరిష్కరించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సందేహాల నివృత్తి కోసం 8341135357 నెంబరులో అధికారులు అందుబాటులో ఉంటారు.

సోషల్ పరీక్షను నిర్ణయించనున్న 'రంజాన్'

రంజాన్ పర్వదినాన్ని సెలవు రోజుగా గుర్తిస్తూ ఈనెల 31వతేదీని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత డిసెంబర్‌లోనే ప్రకటించింది. దీంతో ఏప్రిల్ 1వతేదీని సైతం టైంటేబుల్‌లో చేర్చి రంజాన్ పర్వదినం ఏరోజున వస్తే ఆరోజును సెలవు దినంగా ప్రకటించి తరువాత రోజు సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహిస్తారు. టైంటేబుల్‌లో మార్చి 31, ఏప్రిల్ 1వతేదీ రెండు రోజులను సోషల్ పరీక్షకు కేటాయించారు.

దూరవిద్య పరీక్షలు సైతం..

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదవ తరగతి దూరవిద్య పరీక్షలు సైతం ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నారు. జిల్లాలో 1200 మంది విద్యార్థులు 27 కేంద్రాలలో పరీక్షకు హాజరుకానున్నారు. నరసరావుపేటలో 14, సత్తెనపల్లిలో 8, గురజాలలో 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

న్యాయవాది కొలుసు సీతారాంపై దాడి హేయం

పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్



సత్తెనపల్లి: నూజివీడు న్యాయవాది కొలుసు సీతారాంపై దాడి హేయమైన చర్య అని, ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయకపోవటం దారుణమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ అన్నారు. న్యాయవాది కొలుసు సీతారాంపై జరిగిన దాడిని పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో గురువారం ఆయన ఖండించారు. ఈ సందర్భంగా చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు లెక్కచేయలేదంటే సామాన్య పౌరుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థమవుతుందన్నారు. న్యాయవాద చట్టాల సవరణను మేధావులు, ప్రజాస్వామిక వాదులతో కలసి పౌరసమాజం అర్థం చేసుకోకపోవటం వల్ల పోలీసులు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. అపరిమితమైన అధికారాలు చట్ట సభలు పోలీసులకు ఇవ్వటమే ఈ పరిస్థితికి కారణమన్నారు.

నీటి కాసులపై అవగాహన అవసరం

జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ భువనేశ్వరి



పెదకూరపాడు: నీటి కాసులపై అవగాహన కలిగి ఉండాలని అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. ప్రపంచ గ్లోకోమా (నీటి కాసులు) వారోత్సవాలు సందర్భంగా అమరావతి అమర్ కాలేజీ ఆఫ్ బీఎస్సీ నర్సింగ్ సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నీటి కాసులపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ నీటి కాసుల సమస్యను సకాలంలో తెలుసుకోకపోతే అంధత్వ లక్షణాలు, చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వీటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ రామకృష్ణ అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది మనోహర్, సామ్రాజ్యం, అరుణ శ్రీ, త్రిషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగరకొండ తిరునాళ్లకు 12 ప్రత్యేక బస్సులు

నరసరావుపేట: ఈనెల 14న శుక్రవారం బాపట్ల జిల్లా శింగరకొండలో జరిగే శ్రీ అంజనేయస్వామి తిరునాళ్లకు భక్తులు వెళ్లేందుకు నరసరావుపేట డిపో నుంచి 12 బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ గురువారం వెల్లడించారు. అవి ఏల్చూరు, కొమ్మాలపాడు మీదుగా శింగరకొండకు చేరుకుంటాయన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలు, రుణాలపై నివేదిక అందజేయండి

బ్యాంకు అధికారులను కోరిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు



బ్యాంకు అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు ఎంతమంది లబ్ధిదారులకు, ఏఏ బ్యాంకులు ఎంత రుణాలు ఇచ్చాయో సవివరంగా నివేదికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాం ప్రసాద్‌ని కోరారు. గురువారం కలెక్టర్ కర్యాలయంలో గతేడాది డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీపై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజరులుగా మండలాల్లో కూడా ఒక బ్యాంక్ ఉండాలన్నారు. తద్వారా మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటుచేసుకొని లబ్ధిదారులకు సులభంగా పథకాలపై అవగాహన కలిగించి లబ్ధి చేకూర్చవచ్చని అభిప్రాయపడ్డారు. పీఎంజేజేవై, పీఎం జనధన్ యోజన వంటి పథకాలలో ఎన్ని పనిచేస్తున్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశ్వకర్మ యోజన పథకం కింద శిక్షణ పొందిన వారందరికీ రుణాలు ఇచ్చేలా చూడాలన్నారు. బ్యాంకర్లు తమ తమ పరిధిలో వ్యవసాయ పొలాల్లో రోడ్లు వేసేందుకు సీఎస్ఆర్ నిధులు అందించేలా చూడాలన్నారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ టి.మాధురి తొలుత సమావేశం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాం ప్రసాద్ డిసెంబర్–2024 నాటి త్రైమాసిక నివేదికను పీపీటీ ద్వారా వివరించారు. ఆర్‌బీఐ అధికారి సీహెచ్ నవీన్, నాబార్డు డీడీఎం శరత్ బాబు, వివిధ బ్యాంకుల కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేయాలి



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న డీపీఎం అమలకుమారి, ఏఓ శ్రీనివాస్ తదితరులు

నరసరావుపేట రూరల్: వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి సూచించారు. ప్రకృతి వ్యవసాయ 2025 ఖరీఫ్ ప్రణాళికపై క్రోసూరు, వినుకొండ, మాచర్ల డివిజన్‌లోని సిబ్బందికి గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీపీఎం అమలకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యాలయ ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు నిర్వహించడం వలన రైతులు త్వరితగతిన అభివృద్ధి చెందుతారని తెలిపారు. ప్రణాళిక తయారిలో సామాజిక, ఆర్థిక, భౌతిక వనరులతో పాటు అన్నిరకాల అంశాలను సమగ్రరూపంలో నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయ, డీఆర్‌డీఏ, ఉపాధి హామీ, సెరికల్చర్, హార్టికల్చర్ శాఖల సమన్వయంతో ప్రణాళిక తయారు చేసుకోవలని తెలిపారు. ఏఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలైన తొమ్మిది సార్వత్రిక సూత్రాలను, వాటి లాభాలను రైతులకు తెలియజేయాలని తెలిపారు. అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, జిల్లా శిక్షకుడు టి.సైదయ్య, ఎన్ఎఫ్ఏలు నందకుమార్, సౌజన్య, అప్పలరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక



సోషల్ ఆడిట్ ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ సిద్ధలింగమూర్తి

వినుకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 26 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సామాజిక తనిఖీ బృందం సమర్పించిన నివేదికలను పీడీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో అవకతవకలను మొత్తం రూ.48వేలు పెనాల్టీలు విధించారు. అలాగే రూ.4,00,858లు రికవరీ చేయడానికి ఆదేశించారు. కొన్ని అంశాలపై ఏపీడీ విచారణకు ఆదేశిస్తూ రూ.58,876లు కేటాయించారు. గ్రామసభల్లో కూలీలు లేవనెత్తిన అంశాల ఆధారంగా రూ.96,227లు డ్రాప్ చేయాలని నిర్ణయించారు. రైతులు నాటిన మొక్కలను తిరిగి నాటాలని, రోడ్డు పక్కన నాటిన మొక్కలను పునరుద్ధరించాలని ఆదేశించారు. అంతేకాకుండా రూ.10,47,594 విలువైన పండ్ల తోటల మొక్కలు నాటాలని సూచించారు. మొత్తం మీద ఈ సామాజిక తనిఖీల్లో రూ.15,92,679 విలువైన అవకతవకలను గుర్తించారు. ఈ అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

శనగల విక్రయాలకు పేర్లు నమోదు చేసుకోండి

నరసరావుపేట: జిల్లాలో శనగ పంట వేసి ఈ క్రాప్‌లో తమ పేర్లు నమోదుచేసుకున్న రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను సీఎం యాప్‌లో ఈనెల 15వ తేదీలోగా నమోదుచేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధనుంజయ గనోరే గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రబీసీజన్‌లో రైతులు 20,700హెక్టార్లలో శనగ పంట వేశారని, దీని ద్వారా 16,500 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామన్నారు. క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.5650గా నిర్ణయించడమైందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించదలచుకుంటే సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను యాప్‌లో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

కిమ్స్ శిఖరలో ఉద్యోగ అవకాశాలపై సదస్సు

గుంటూరు మెడికల్: ఆరోగ్య రంగంలో నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలపై గుంటూరు మంగళదాస్‌నగర్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో ఈనెల 20న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.హెచ్.నాగేశ్వరరావు తెలిపారు. సదస్సుకు కిమ్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతారన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఆరోగ్యరంగంలో శిక్షణ, ఉపాధి అవకాశాలపై సదస్సులో వివరిస్తారన్నారు. ఏడాది శిక్షణలో ఒకనెల ప్రాథమిక శిక్షణ, 11 నెలలు ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు శిక్షణలో స్టయిఫండ్ అందిస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేసి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 8121027256, 7416600691 నంబర్లకు సంప్రదించాలని నాగేశ్వరరావు కోరారు.

బాల శాస్త్రవేత్త సిద్ధార్థ్‌కు సన్మానం



గుంటూరు మెడికల్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో గుండె పనితీరు పరీక్షలు చేస్తున్న 14 ఏళ్ల బాల శాస్త్రవేత్త సిద్ధార్థ్ సుమారు 14వేల మంది అమెరికా పౌరులపై రీసెర్చ్ చేశారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ తెలిపారు. సిద్ధార్థ్ తాను కనుగొన్న యాప్ ద్వారా జీజీహెచ్‌లో రెండు రోజులుగా పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ్‌ను డాక్టర్ యశశ్వి రమణ గురువారం సత్కరించారు. సిద్ధార్థ్‌కు మంచి భవిత ఉందని చెప్పారు. సిద్ధార్థ్‌ను ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. బాల శాస్త్రవేత్త సిద్ధార్థ్ మాట్లాడుతూ గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో తాను చేసిన పరీక్షల సందర్భంగా గుర్తించిన అంశాలను వివరించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని రెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యాలయం గురువారం ప్రారంభమైంది. కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర లీగల్‌సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అరాచకాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటి నుంచి ఇప్పటివరకు ఒక్క పెదకూరపాడు నియోజకవర్గంలోనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై 300 పైగా అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో కూడా పరిస్థితి ఇలాగే ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలకు మనోధైర్యాన్ని కల్పించేందుకు లీగల్ సెల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వ బాధితులకు జిల్లా లీగల్ సెల్ కార్యాలయం సహాయపడుతుందని వివరించారు.

వైభవంగా ప్రసన్నాంజనేయుని తిరునాళ్ల



కొండకింద ప్రసన్నాంజనేయస్వామికి పూజలు



తిరునాళ్లకు తరలివచ్చిన భారీ విద్యుత్ ప్రభ

యడ్లపాడు: మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీలో కొలువుదీరిన ప్రసన్నాంజనేయ స్వామి 41వ తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. గోపాలపురం, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల నడుమ, కొండవీడు కొండల్లో వెలసిన ఈ స్వామివారి ఆలయానికి వేకువజాము నుండే భక్తుల రద్దీ నెలకొంది. వివిధ మొక్కులు చేసుకున్న భక్తులు చిన్న చిన్న ప్రభలతో కుటుంబ సమేతంగా జై హనుమాన్ నామస్మరణ చేస్తూ కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. మహిళలు కొండ కింద పొంగళ్లను పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులే కాకుండా సుదూర ప్రాంతాలకు చెందినవారు పెద్దఎత్తున తరలివచ్చారు. తిరునాళ్ల సందర్భంగా నిర్వాహకులు ఆలయానికి కొత్తరంగులు, రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ గావించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు పలు రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస, కొత్తసొలస, గోపాలపురం గ్రామస్తులు సమష్టిగా నిర్వహిస్తున్న ఈ తిరునాళ్ల మహోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులకు మహా అన్న సంతర్పణ గావించారు. రాత్రికి చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస, సంక్రాంతిపాడు గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి. వీటితో పాటు సొలస గ్రామప్రభను గ్రామపెద్దలు తీసుకువచ్చారు. తిరునాళ్ల సందర్భంగా ప్రభల వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను భారీగా ఏర్పాటు చేశారు. పోలీసులు తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన



ఏపీఐఐసీ భూములను పరిశీలిస్తున్న జేసీ సూరజ్ గనోరే, ఆర్డీఓ మధులత

నరసరావుపేట రూరల్: మండలంలోని కేసానుపల్లి సమీపంలోని ఏపీఐఐసీ భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఆర్డీఓ మధులత గురువారం పరిశీలించారు. నరసరావుపేట నియోజకవర్గానికి మంజూరైన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం అధికారులు ఈ భూముల పరిశీలన జరిపారు. ఈ భూములను గత ప్రభుత్వ హయాంలో ఆటోనగర్‌కు కేటాయించిన విషయం విధితమే. ఆటోనగర్ ఏర్పాటుకు శంకుస్థాపన కూడా చేశారు. ఆటోనగర్‌కు కేటాయించగా మిగిలిన భూముల్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. కేంద్రీయ విద్యాలయం రొంపిచర్లలో ఏర్పాటుచేయాలని మొదట భావించారు. తాజాగా కేసానుపల్లిలోని ఆటోనగర్‌కు కేటాయించిన భూములను కూడా పరిగణలోకి తీసుకొన్నారు. ఈ భూముల పై నుంచి హైటెన్షన్ వైర్లు వెళ్లడం, ప్రధాన రోడ్డుకు కిలోన్నర మీటరు దూరం ఉండటం వంటి వాటిని అధికారులు గుర్తించారు. దీనిపై నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు.

లైంగిక దాడుల నివారణపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం సమావేశ మందిరంలో పిల్లలపై లైంగిక దాడులను నివారించడంపై డీఈవోలు, ఐసీడీఎస్, చైల్డ్ ప్రొటెక్షన్, ఎంఈఓలు ప్రోగ్రాం ఆఫీసర్స్, డిజేబుల్ వెల్ఫేర్ శాఖ, ఆర్‌బీఎస్‌కే సిబ్బందికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎదిగే వయసులో ఉన్న పిల్లలతో కొంత సమయం కేటాయించాలన్నారు. స్నేహపూరితమైన వాతావరణంలో వారితో అన్ని సమస్యలు చర్చించాలన్నారు. పిల్లలు అన్ని విషయాలు పంచుకుంటారని, తద్వారా , వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కార మార్గాలు చెప్పడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ టి.ఓ.టి, ఆర్. సుప్రజ, సైకాలజిస్ట్ విజయకుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయలక్ష్మీ, పిడి ఐసిడిఎస్, తెనాలి, గుంటూరు డెప్యూటీ డీఈవోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్ శ్రావణ్ బాబు, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ ప్రియాంక, పీడియాట్రిస్ట్ పి.నాగ శిరీష పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహిస్తాం

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు

తాడికొండ: గుంటూరు జిల్లా వెంకటపాలెం గ్రామంలోని శ్రీ వేంటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న సాయంత్రం 6:30 నుంచి 8:30 గంటల వరకు శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు చెప్పారు. వెంకటపాలెంలోని శ్రీవారి ఆలయ ప్రాంగణంలో టీటీడీ చైర్మన్ ఈవో జె.శ్యామలరావుతో కలిసిఆయన మీడియా సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ, అమరావతి పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాకలక్ష్మీ, ఎం.శాంతారామ్, ఎం.ఎస్.రాజు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, సీపీఆర్‌ఓ డాక్టర్ టి.రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అలరించిన వీవీఐటీ రంగస్థల వేడుక



మా నాన్న రైతే బృందానికి ప్రథమ బహుమతి అందజేస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన థియేటర్స్ డే వేడుక వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ వినోదం, విజ్ఞానం మేళవింపుతో వీవీఐటీ కార్యక్రమానికి వర్ధమాన నటుడు, రంగస్థల యువ దర్శకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ నందీపురస్కార గ్రహీత రౌతు వాసుదేవరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా విజేతలకు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బహుమతులు అందజేశారు. ఈఈఈ విద్యార్థులు రూపొందించిన 'అవును మా నాన్న రైతే' ప్రథమ బహుమతి అందుకోగా, మెకానికల్ విద్యార్థులు ప్రదర్శించిన 'పుష్పవల్లి నిలయం ద్వితీయ బహుమతి అందుకుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్స్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి పాల్గొన్నారు.

'గోల్డ్'మాల్ గోవిందం

- 5.8కిలోల బంగారం మాయం
- ఇండిల్ గోల్డ్ మనీ సంస్థ మేనేజర్ చేతి వాటం
- ఖాతాదారుకు తెలియకుండానే బంగారం అమ్మకం
- అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఇండిల్ గోల్డ్‌మనీ సంస్థలో లోన్ కోసం కుదవ పెట్టిన 5.845 కిలోల బంగారం మాయమైంది. దీనిపై బాధితురాలి ఫిర్యాదుతో అరండల్‌పేట పోలీసులు బుధవారం అర్ధ రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ముత్యాలరెడ్డినగర్ 4వ లైన్ ప్రాంతానికి చెందిన మేకలశిల్ప గుంటూరు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో గోల్డ్, ఆభరణాల వ్యాపారం చేస్తుంటారు. ఆమె వ్యాపార అవసరాల కోసం తన వద్ద ఉన్న బంగారాన్ని అరండల్‌పేట 10వ లైన్‌లోని ఇండిల్ గోల్డ్ మనీ సంస్థలో కుదవపెట్టి రుణం తీసుకోవాలని తలంచారు. అయితే సంస్థ మేనేజర్ రజిని మీ పేరున అంత బంగారం పెట్టడం కుదరదని, వేరే వారి పేర్లపై బంగారం పెట్టి రుణం మంజూరు చేస్తామని నమ్మబలికారు. దఫాల వారీగా బంగారం కుదవపెట్టి రూ.2.30 కోట్లు రుణం మంజూరు చేశారు. 2024 జులై నెలలో శిల్పకు డబ్బులు అందడంతో బంగారం తీసుకునేందుకు సంస్థకు వెళ్లారు. అయితే ఆమె పేరున కుదవ పెట్టిన బంగారం అంతా అమ్మేసినట్లు యాజమాన్యం తెలిపింది. మిగిలిన బంగారాన్ని ఎవరి పేర్లపై పెట్టారో వారు తీసుకెళ్లిపోయారని వివరించారు. దీంతో బాధితురాలు సంస్థ సిబ్బందిని నిలదీశారు. అనంతరం శిల్ప ఆర్‌బీఐకి, కేరళలోని ఇండిల్ ప్రధాన కార్యాలయానికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇండిల్ సంస్థకు ఏరియా మేనేజర్ భాస్కర్, ఆపరేషనల్ మేనేజర్ జాలిరెడ్డి, జోనల్ హెడ్ మేనేజర్ రమేష్‌రాజా, సంస్థ లీగల్ అడ్వైజర్ ప్రమోద్ బాధితురాలి వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. బాధితురాలు ఆరా తీస్తే అంతకుముందు కూడా తన బంగారాన్ని వేర్వేరు పేర్లపై కుదవపెట్టిన రజిని దానిని ఇతర వాణిజ్య సంస్థల్లో మార్చి ఎక్కువ డబ్బులు తీసుకున్నట్టు తెలుసుకున్న ఎట్టకేలకు శిల్ప బుధవారం రాత్రి ఇండిల్ గోల్డ్‌మనీ సంస్థపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారిని తోడ్కొని వెళుతున్న నిర్వాహకులు

తెనాలి: చెంచుపేట అమరావతి కాలనీలోని శ్రీగోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 12వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలను ఆరంభించారు. ఈనెల 17 వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు యాగశాల ప్రవేశం, వేదవిన్నపాలు, ప్రధాన కలశస్థాపన, చతుస్థానార్చనలు, నిత్యపూర్ణాహుతి చేశారు. ఉదయం 10 గంటలకు 'ధ్వజారోహణం', గరుడ ప్రసాదగోష్టి తదుపరి తీర్థప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణ, నిత్యహోమం, భేరిపూజ, దేవతాహ్వానం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈనె 15వ తేదీన శ్రీస్వామివారి కళాణ మహోత్సవం వైభవంగా జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. వార్షికోత్సవాలకు ముందుగా ఈనెల 9వ తేదీనుండి 11వ తేదీవరకు అధ్యయనోత్సవాలు జరిగాయి.